రేపు ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు కల్చరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలపై స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు కె.సునీల్‌బాబు, కె.సృజన్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్స్, రైల్వే, పోస్టల్, గ్రూప్స్, పోలీసు, సీహెచ్‌ఎస్ఎల్/సీజీఎల్ వంటి పరీక్షలపై ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు ఉచితంగా నమూనా పరీక్ష నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఈ పరీక్షలో విజేతలకు మొదటి బహుమతి రూ.3వేలు, రెండో బహుమతి రూ.2వేలు అందిస్తామని వివరించారు. విద్యార్థులకు సిలబస్, పరీక్ష సరళి, మెటీరియల్స్ వివరాలను నిపుణులు వివరిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8099919877 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హోమస్ పేటలోని గోదావరి అర్బన్ బ్యాంక్‌లో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ ఆపరేటర్స్, ఆఫీసు సిబ్బందికి నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలలో 50 మంది పాల్గొనగా 9 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు హెచ్‌ఆర్ మేనేజర్ కల్యాణి, సీనియర్ మేనేజర్ నాగబాబు, అసిస్టెంట్ మేనేజర్ సునీల్ గోనెవాడ్, విజిలెన్స్ అధికారి విజయ కుమార్, మేనేజర్ రామాంజనేయులు, నజీర్ బాషా, అధికారులు జగదీష్‌బాబు, మౌనిక, హుస్నా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను రైతులు అందిపుచ్చుకోవాలి

మైదుకూరు : వ్యవసాయాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు అందిపుచ్చుకోవాలని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శుక్రవారం కేవీకే ఆధ్వర్యంలో పోరుమామిళ్ల మండలంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు పంటల సాగులో అండగా నిలిచేందుకు యంత్ర పరికరాలను, డ్రిప్ పరికరాలను సబ్సిడీతో అందిస్తోందని తెలిపారు. వివిధ ప్రభుత్వ పథకాలు సబ్సిడీ వివరాలను ఆయన రైతులకు వివరించారు. జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థకు చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ ఉమాకాంత్ రైతులకు వివిధ పంటల సాగులో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

మహిళలకు 'కూటమి' కుచ్చుటోపీ

- నమ్మించి నట్టేట ముంచిన చంద్రబాబు
- ఏడాదైనా నెరవేరని హామీ
- సాయం కోసం మహిళల ఎదురుచూపు



ప్రొద్దుటూరు : కుటుంబంలో ఎంత మంది మహిళలు ఉంటే అందరికీ నెలకు రూ.1,500 చొప్పున ఇస్తానని ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. తమ వ్యక్తిగత అవసరాల కోసం ఈ డబ్బును వినియోగించుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైంది. ఇప్పటివరకు ఈ పథకం ఊసే లేదు. పథకాన్ని ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందా అని మహిళలు ఎదురుచూస్తున్నారు. 18 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలందరికి ఈ పథకాన్ని వర్తింపజేయాల్సి ఉంది. ఈ ప్రకారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాలకు సంబంధించి 97,933 మంది మహిళలు ఉన్నారు. ఈ లెక్కన ప్రతి నెల మహిళల ఖాతాల్లో రూ.14,68,99,500 జమ చేయాల్సి ఉంది.

ఆడ బిడ్డనిధికి చంద్ర గ్రహణమా..?

అట్లూరు : కూటమి నేతలు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్‌లో భాగంగా ఆడబిడ్డ నిధి హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ ఆ హామీ అమలు చేయలేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే 18 ఏళ్లు పైబడి 59 ఏళ్లకు లోబడిన మహిళలకు నెలకు రూ.1500లు చొప్పున ఆడబిడ్డ నిధి కింద అందజేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఏ ఒక్క మహిళకు జమ చేసిన దాఖలాలు లేవు.

- బద్వేలు నియోజకవర్గంలో బద్వేలు మున్సిపాలిటీతో పాటు బద్వేలు, అట్లూరు, కలసపాడు, కాశినాయన, బి కోడూరు, పోరుమామిళ్ల, గోపవరం మండలాలు ఉన్నాయి. ఆయా మండలాలలో సుమారు ఆడబిడ్డనిధికి అర్హులైన మహిళలు 88,128 మంది ఉన్నారు. అయితే వారికి ఒక నెలకు రూ.13,21,92,000 ఇవ్వ వలసి ఉంది. ఇలా ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావస్తుంది. ఈ చొప్పున ఏడాదికి బద్వేలు నియోజకవర్గంలోని మహిళలకు రూ.158,63,04,000లు ఇప్పటికి చెల్లించ వలసి ఉంది. అయితే ప్రభుత్వం మాత్రం ఆ ఊసే ఎత్తక పోవడంతో ఇచ్చిన హామీ విస్మరించినట్లేనా? అని నియోజక వర్గ ప్రజలు పేర్కొంటున్నారు.

బాబు ష్యూరిటీకి గ్యారంటీ ఎప్పుడో..!

చాపాడు : గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి మాజీ ముఖ్యమంత్రి, ఇప్పటి సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలతో ఆరు సంక్షేమ పథకాల హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఇస్తామని చెప్పిన ఈ హామీలలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెల రూ.1500లు ఇవ్వడం ఒకటి. కూటమి ప్రభుత్వం అధికారం లోకి ఏడాది అవుతున్నా ఆడ బిడ్డ పథకం అమలుకు నోచుకోలేదు. దీంతో ప్రతి గ్రామంలో 18 ఏళ్లు నిండిన మహిళలు ప్రతి నెలా ఇస్తామని చెప్పిన రూ.1500ల కోసం ఎదురు చూస్తున్నారు.

బాబును నమ్మి మోసపోయిన మహిళలు



అధికారంలోకి వచ్చేందుకు సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేయలేదు. అధికార పీఠం కోసం ఆయన అబద్ధపు హామీలు ఇచ్చారు. మహిళలు ఆయనను నమ్మి మరోసారి మోసపోయారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్యాలెండర్ ప్రకారం పథకాలను అమలు చేసి ప్రజల ఖాతాల్లో డబ్బు జమ చేశారు. ఇప్పుడు పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.

– జేష్టాది శారద, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్

చంద్రబాబు వంచనను 'వెన్నుపోటు దినం'తో ఎండగడతాం

- జూన్ 4న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రాబాబు చేసిన వంచనను జూన్ 4వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వెన్నుపోటు దినం'తో ఎండగడతామని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు వాగ్దానాలు చేశారని.. ఏడాది అయినా ఇంత వరకు ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను దగా చేశాడని తీవ్రంగా ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించారన్నారు. అయినా ప్రజల తీర్పును శిరసా వహించాల్సిందేనన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాడని తెలిపారు. ఇప్పటికే 90 శాతంపైగా ప్రజలు చంద్రబాబు చేతిలో మోసపోయామని, ఎన్నో పథకాల ద్వారా ఆదుకున్న జగన్‌మోహన్‌రెడ్డికి అన్యాయం చేశామనే పశ్చాత్తాపం ప్రజల్లో కనిపిస్తోందన్నారు. జూన్ 4న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చంద్రబాబు మోసాన్ని, వంచనను నిలదీసేందుకు వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయో.. ఎందుకు నెరవేర్చలేదో చంద్రబాబు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి డిమాండ్ చేశారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం పేరుతో రూ.15వేలు వంతున ఇస్తామని ఇంత వరకు అమలు చేయలేదన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామని ఇంత వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. 18 ఏళ్లు నిండదిన యువతులకు ఆడ బిడ్డ నిధి కింద రూ.1500 ఇస్తామన్నారు.. మహిళలకు ఉచిత బస్సు అన్నారు.. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పారు అవన్నీ ఏమయ్యాయని నిలదీశారు. యువగళం పేరుతో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని ఏడాదైనా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. వలంటీర్లకు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామని వారిని అసలు మనుగడలోనే లేకుండా చేశారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఇంటింటికి రేషన్ అందించామని, చంద్రబాబు ఎండీయూ వాహనాలను రద్దు చేసి రేషన్ అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఏడాదైనా కొత్త పింఛన్ ఒక్కటి కూడా ఇవ్వలేదని, ఉన్న పింఛన్లను తొలగించేందుకు చర్యలు చేపట్టడం శోచనీయమని పేర్కొన్నారు.

చంద్రబాబు అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన జూన్ 4వ తేదీన వైఎస్సార్‌సీపీ చేపట్టే వెన్నుపోటు దినం ర్యాలీకి చంద్రబాబు చేతిలో మోసపోయిన మహిళలు, రైతులు, నిరుద్యోగులు, వలంటీర్లు భారీగా తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రభుత్వ మాజీ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, గల్లా నరసింహారెడ్డి, తెలిదేల లక్షుమయ్య, ఊటుకూరు రఘురామిరెడ్డి, నేట్లపల్లె శివారం, ఇడగొట్టు శేషు, డి.శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, మహబూబ్ షరీఫ్, భరత్ కుమార్‌రెడ్డి, తవ్వా వెంకటయ్య, బీఎల్ రఘురామయ్య, ఇర్షాద్, ట్రాక్టర్ గౌస్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

77 జీఓ రద్దుకు డిమాండ్

ప్రొద్దుటూరు కల్చరల్ : పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని పీఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్, జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్ర బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ గంగయ్యకు వారు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ జీఓ నంబర్ 77 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు పీజీ కోర్సుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందలేకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో జీఓ నంబర్ 77ను రద్దు చేస్తామని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఈ జీఓను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని వారు కోరారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

ప్రొద్దుటూరు రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సోములవారిపల్లె, బీబీ నగర్, ఈశ్వర్‌రెడ్డినగర్‌లలో శుక్రవారం డ్రైడే- ఫ్రైడేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు ఆరోగ్యానికి చేటు అని, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని దోమలు కుట్టకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, హెల్త్ సూపర్ వైజర్ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్ఎంలు ఉమారాణి, వీరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



ఎరసాలలో ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

పోరుమామిళ్ల : మండలంలోని గానుగపెంట పంచాయతీ రౌతుపల్లెలో శుక్రవారం జరిగిన శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీ కోదండరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అర్చకులు వారికి శాలువలతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందచేశారు.
వారి వెంట సింగల్ విండో అధ్యక్షులు వెంగళరెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సర్పంచ్ వీరభద్రుడు, కలసపాడు జడ్పీటీసీ గురివిరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మండలంలోని పెద్ద ఎరసాలలో శుక్రవారం శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, పూలమాల, శాలువతో సత్కరించారు. వారి వెంట పార్టీ నాయకులు దశరథరామిరెడ్డి, రవిచంద్రారెడ్డి, రామిరెడ్డి, రమణారెడ్డి, పుల్లారెడ్డి, మాల్యాద్రి, హరిశ్చంద్రారెడ్డి, గురివిరెడ్డి, సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్య మఠం, కొండావధూత ఆశ్రమం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యహవాచనం, రక్షాబంధనం, మృత్యుంగ్రహణం, అంకురార్పణ, వాస్తుహోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌లకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకట రామిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు..
వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం ధ్వజారోహణం, కుంభ ప్రతిష్ఠ, అగ్నిప్రతిష్ట, నిత్యహోమం, సాయంత్రం శేషవాహనసేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కమనీయం... కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానదీ తీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ప్రాతఃకాలపూజ, ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అన్నాభిషేకం, ఆవాహిత దేవతాహోమాలు, లఘుపూర్ణాహుతి తదితర పూజలు జరిగాయి. అలాగే ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తిపీఠాలకు, నవరత్నలింగాలకు విశేష పూజాకార్యక్రమాలు చేశారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ప్రత్యేంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువు దీర్చారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ముత్యాల తలంబ్రాలతో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. కాగా శనివారం గణపతి, నవగ్రహ, చండీహోమాలు, మహాపూర్ణాహుతి చేయనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి నామా నాగా శ్రీనివాసులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, తల్లం కిశోర్, అమృతేశ్వరస్వామి, అయ్యప్పస్వామి ఆలయాల కమిటీల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

పరామర్శ

దువ్వూరు : చింతకుంట గ్రామానికి చెందిన సర్పంచ్ కోగటం వీరారెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి శుక్రవారం చింతకుంటకు వెళ్లి వీరారెడ్డిని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, చింతకుంట ఎంపీటీసీ ఖాదర్‌బాషా, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, గుడిపాడు ఎంపీటీసీ గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, గుడిపాడు సర్పంచ్ మాబు షరీఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు లోమడ వీరశేఖర్‌రెడ్డి, సంగన హరినాథరెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, గుర్రాల రామమునిరెడ్డి, పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శనివారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రొద్దుటూరు రూరల్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి సూచించారు. మండలంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో సచివాలయ, వెలుగు సిబ్బందికి నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న యోగా శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న యోగా ఆసనాలను తమ సచివాలయ పరిధిలోని ప్రజలకు నేర్పించాలన్నారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈ శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.